# మౌనం ఎరుపు

**పాకుడెక్కిన బండపై కాలుమోపగానే జర్రుమంటూ నీళ్లలోకి కాలు జారింది.**

**"అగో! జర మెల్లగ సారూ! సూసుకుంటనడుండ్రి. గీ బండలు పురాగ పాకురువట్టి ఉన్నయ్!"**

**"ఫర్వాలేదు జంగూ! నా కలవాటే గనిమీద తెప్పలు జూస్తివా ఎట్లగూడుగస్తున్నయో! మనల్ని మీ గూడెం దాకన్నా పోనిస్తయా లేదా?"**

జంగు ఆకాశంవైపు చూశాడు. నల్లని పెద్ద పెద్ద మబ్బులు, గతి తప్పిన ఆకలి ఊరేగింపులోని జనంలా భూమికి మరింత దగ్గరగా వేగంగా కమ్ముకొస్తున్నాయి.

"ఇగెంత దూరంసార్! గొంచెం కాలుజెల్ది లేపితే వాన రాకంటే ముందే గూడెం దాకా ముద్దం."

కాలుని మోకాలుబంటి బురదలోంచి తీసి మళ్లీ వేయడమే కష్టంగా ఉంది.

నేనూ, జంగూ, సాంబన్న, సోనేరావు కలిసి మరింత తొందరగా గూడెంవైపు అడుగులేస్తున్నాం.

పెద్ద వర్షం వచ్చే సూచనగా గాలి చల్లగా చెవులకు కొడుతోంది. సాయంకాలం వర్షం పట్టుకుందంటే ఓ పట్టాన వదలదు, చుట్టం లాగే!

వారం రోజుల్నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మా ప్రాంతంలో పంటలు ఎక్కడికక్కడ కొట్టుకుపోయాయి. రైతన్నలు దీనంగా, కొట్టుకుపోతున్న తమ కష్టం కేసి మౌనంగా చూడటం మినహా మరేమీ చేయలేకపోయారు. ఎన్నో పంట పొలాల ఆకారాలే మారిపోయి నిలువెత్తున గండ్లుపడ్డాయి. ఒక్కోచోట నడుం బంటి ఇసుకమేటలు వేశాయి.

ఈ గిరిజనులకు వరదలవల్ల కలిగిన పంట నష్టాన్ని అంచనావేయడానికి వచ్చిన నాకు, ఆ పల్లెలో జరిగిన నష్టాన్ని చూస్తూ ఉంటే, వారి భవిష్యత్తును గురించి ఆలోచించడానికి భయం వేసింది.

మేము ఎంతవేగంగా నడిచినా ఎదురుగా గుట్టమీదకు పెద్ద జల్లు రానే వచ్చింది. చూస్తూండగానే మమ్మల్ని కమ్మేసింది. నేను పట్టుకున్న గొడుగు వానధాటికి ఆగలేకపోతోంది.

అయిదు నిమిషాల్లో గూడెంలో కొచ్చి పడ్డాము. ఇక ఈరోజుకి ఇక్కడ ఉండిపోవాల్సిందే. రేపు కూడా గూడెం దగ్గర పెద్ద వాగులో నీళ్ల దాటనిస్తేనే తప్ప, నేను ఇల్లు చేరేట్లు లేను.

జంగు, గుడిసె ముందరి చూరు క్రింద ఒక మంచం తెచ్చివేశాడు. ఎండుకట్టెలూ, పుల్లలూ తెచ్చి భట్టిలో వేసి పెద్దమంట వేశారు. మంచం భట్టి దగ్గరకు జరుపుకొని బట్టలారబెట్టుకుంటూ కూర్చున్నాను. జంగూ మిగతా వాళ్లు బీడీలు కాలుస్తూ, విచారంగా, కుండపోతగా కురుస్తూన్న వానధారలకేసి చూస్తున్నారు.

నిజానికి ఈ రోజు నేను సర్వే చేసిన నష్టమంతా ఒకెత్తు, ఈ రోజు రాత్రికి జరిగే నష్టమంతా ఒకెత్తు అనిపించింది ఆ వాన ధాటిని చూస్తుంటే!

"జంగూ! ఇగ ఈ ఒక్క రోజుకు నిన్ను తిండికి తిప్పలు పెట్టనే వద్దు. ఏదుంటే గదే పెట్టు! ఏమంటవ్?"

"అరరరే! తిప్పలెల్లా అవుతది సారూ! మా సుని మీద గింత తిప్పలు పడి అస్తిరి. మేం అర్సుకోకుంటే ఒళ్ళర్సుకుంటరు? గదానికి మీరు ఫికర్ జెయ్యొద్దు. ఇగ మా తిండి మీకు పసందుగాకున్నా, గీ ఒక్క రోజుకు ఓర్సుకోండ్రి!"

"పసందేంటికి గాదు జంగూ! మా పట్నపోళ్ల తిండిల బలమేమున్నది. మీ తిండే మంచిది".

"యాడిది సారూ! మా దగ్గర గా మసాల దినుసులేదుంటయి. గాయింత మంచిమాసె గావాలన్నా అంగడికోయి దెచ్చుకోవాల. లేకుంటే గట్లనే ఉడ్కవెట్టుకొని తినుడే!"

వాళ్లు ఏదో పండగలప్పుడు తప్పించి మసాలు వాడరు. ఏదైనా సరే ఉడకేసుకొని ఇంత ఉప్పుకారం కలుపుకొని తినేస్తారు.

చివరికి ఆ రాత్రి వారితోబాటు వేడివేడి జొన్న రొట్టెలు, ఉడకేసిన పుంటికూర పెసరపప్పు, అధరువుగా వెల్లుల్లికారం తృప్తిగా తిన్నాను. శారీరకంగా తృప్తిగా ఉన్నా మనసు మాత్రం, జరుగుతున్న నష్టాన్ని చూసి చాలా అసంతృప్తిగా ఉంది.

భోజనం ముగించి మళ్ళీ నెగడువద్దకు వచ్చి మంచంలో కూర్చున్నాను. ఒక్కొక్కరే ఆ చూరు క్రిందకు చేరుకుంటున్నారు. అందరూ అదోరకం విచారంతో, సీరియస్‌గా, మంటను ఎగదోస్తూ బీడీలు కాలుస్తూ ఉన్నారు.

ఈ జాతి గిరిజనులు మామూలుగానే చాలా ముభావంతో ఉంటారు. ఒకింట్లో వాళ్ళయినా ఒకర్నొకరు చాలా మెల్లిగా, క్లుప్తంగా, అవసరమున్నంత మట్టుకే పలకరించుకుంటారు. అందుకేనేమో వారి సామూహిక జీవితం, అంత పటిష్ఠంగా ఉండి, నాగరిక సమాజంలో 'నాగరీకుల'మని విర్రవీగుతోన్న 'అనాగరికుల', శబ్ద కాలుష్యపు జనారణ్యాలకన్నా ఎంతో ప్రశాంతంగా గడిచిపోతూంది. గొంతు చించుకొని మాట్లాడడాన్ని చాలా అసభ్యంగా భావిస్తారు వాళ్లు. పిల్లుకబుర్లు చెప్పేవాళ్లని అసహ్యంగా చూస్తారు.

ఉన్నట్టుండి నాకో చిన్న ఉపాయం తట్టింది. నీళ్ళలో కాస్సేపైనా ఉత్సాహం నింపాలనిపించింది.

## శ్రమ శక్తిని నిట్టనిలువునా దోచుకుంటున్న ఆధునిక ప్రపంచంపై 'గిరిజనుల' తిరుగుబాటు బావుటా!

"జంగూ! మీ పూర్లె రాత్రికి గిట్లభజన చేస్తరా? నాకు వినాలని ఉన్నది!"

"ఆ చేస్తరు గని సారూ! ఇగ వాళ్లద్దుల సంది అందరు 'నారాజ్' తోని ఉన్నరు. సేసిన కష్టం పెద్దాగుల గొట్కపాయ, ఇగ ఖుషీ కొద్ది భజనెట్ల చేస్తరు సార్! మీరు రావ్కపోతందుకు అచ్చిన కాడికెళ్ళి గొంచెం ఆశపడి ఉన్నరు!" అంటూ తన వాళ్ళతో ఏదో చెప్పాడు. కొద్ది తర్జనభర్జనల అనంతరం 'చేస్తరట సార్' అని వాళ్ళ అంగీకారాన్ని నాకు తెలిపాడు.

వాళ్ళకిష్టం లేకపోయినా వారి సంగీతాన్ని వినే అవకాశం నాకు మళ్ళీ రాదనుకోవడంవల్ల, అదిగాక ఈ రాత్రి ఎలాగో గడపాలి గాబట్టి ఆ ప్రతిపాదన చేశాను. మరో పది హేను నిమిషాల్లో డోలు, హార్మోనీ ఏకతార తీసుకొని వచ్చేశారు. వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. నెగడు కాస్త పెద్దదిగా చేసి దానికి రెండువైపులా నెచ్చలేశారు.

వి. మురళీధర్




వారిలో ఒక ముసలాడు ఏకతార శృతిచేసుకొని వారి భాషలో మొదట దైవప్రార్థన చేశాడు.

ఆ తర్వాత ఒక్కొక్క పాట మొదలయింది. శాస్త్రీయ సంగీతం వినడంలో అంతో ఇంతో అభిరుచి ఉన్న నాకు వీళ్ళపాట, లయ ఒకదశలో అంతకంటే ఎక్కువే ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

అంత వర్షపు రాత్రిలోనూ వారు పాడుతూంటే వాళ్ళనొసట చెమట బిందువులు మెరుస్తున్నాయి. శ్రమజీవులు శ్రమలోనేగాకుండా భగవంతుని స్మరణలో కూడా నిజాయితీతో, చిత్తశుద్ధితో తమ స్వేదాన్ని ఒలకబోస్తారనిపించింది. ఆధునిక ప్రపంచంలో సంగీతమంటే 'చెవులు కోసుకొని', 'మొండి' చెవులతో దర్శనమిచ్చే రసజ్ఞ శ్రోతలకు ఈ సంగీతం ఒక్కసారి వినిపిస్తే, సంగీతం గురించి వారి ఊహలు తారుమారు గాకపోయినా, కనీసం ఇన్నాళ్ళూ ఈ సంగీతం, లయ విననందుకు తప్పకుండా విచారపడ్తా

రపించింది. మనసుతో పాడినపుడు ఏరకం సంగీతానికైనా, దాని శక్తి ద్విగుణీకృతం కావడం కేవలం అనుభవంతో మాత్రమే తెలుసుకోగలిగిన నిజం.

ఆ భయంకరమైన చీకటి వర్షపు రాత్రిలో, కాపాడమని ఆ భగవంతుని ఎలుగెత్తి ప్రార్థించే సంగీతం విని, చివరకు నేనూ, నాకు తెలియకుండానే గట్టిగా చప్పట్లు కొడుతూ వారితోబాటు శృతి కలిపాను. ఒక రెండు గంటలు వర్షాన్నీ, వరదలనీ, కరువునీ వాళ్ళా, నన్ను నేనూ మరచిపోయిన తర్వాత ఆ కార్యక్రమం ముగిసింది.

అందరూ 'రాంరాం' అంటూ నావద్ద సెలవుతీసుకొని వెళ్ళిపోయారు. వర్షం ఇప్పుడు ముసురులాగా మారింది. ఆ నెగడు ప్రక్కనే క్రింద జంగు, సాంబన్న పడుకున్నారు. నేను నా మంచాన్ని మరింత దగ్గరగా జరుపుకొని నిద్రకుపక్రమించాను. దూరాన పెద్దవాగు పొంగుతున్న శబ్దం, కీచురాళ్ళ అరుపులూ, సన్నటి తుంపర, గడ్డికప్పు మీద చేస్తున్న లయబద్ధమైన చప్పుడూ తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

మగత నిద్రలో ఉన్న నాకు ఓ సన్నటి మూలుగు వినిపిస్తోంది. అలాగే వింటూంటే, అది మరింత ఎక్కువై ఏడుపుగా మారింది. నాలుగు గుడిసెల అవతల ఓ గుడిసెలో ఒక స్త్రీ ఏడుపది.

ఆ ఏడుపుకి జంగూ, సాంబన్నలు కూడా లేచారు. అప్పటికే చుట్టుప్రక్కలా మరికొందరు లేచిన అలికిడయింది.

"ఏమయింది జంగూ! ఎవరా ఏడ్చేది? ఎందుకేడుస్తున్నారు?"

"గా సోనేరావు ఇంట్ల కెల్లి ఇనవస్తున్నది సార్! మరి ఏమయిందో ఏమో? నేను పోయి అర్సుకస్త!" అంటూలేచి ఆ వైపుకి వెళ్ళాడు.

నేనూ మంచందిగి ఆ గుడిసెవైపుకి వెళ్ళాను! అప్పటికే ఇంకో ఏడెనిమిది మంది అక్కడ చేరి ఆమెను ఓదారుస్తున్నారు.

నేను కనపడగానే అందరూ ప్రక్కకి జరిగి దారిచ్చారు.

"ఏమయింది సోనేరావూ? ఎందుకేడుస్తున్నారు! ఎవరికన్నా పానం మంచిగలేదా?" అంటూ అడిగాను.

అలా అడగగానే సోనేరావు భార్య మొహానికి కొంగు అడ్డంపెట్టుకొని మరింత ఏడుస్తోంది. ఒడిలో రెండేళ్ళ కొడుకూ ఏడుపందుకున్నాడు. సోనేరావు కూడా కళ్ళుతుడుస్తూ భార్యను సముదాయిస్తున్నాడు.

చివరికి జంగుచెప్పిన కారణం విని, నాకూ నోట మాట రాక, కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!

మూడెకరాల్లో తొందరగా చేతికంది వస్తుందని పెసరపంట వేశారట! వాళ్ళ కుటుంబానికి ఆ మూడెకరాలే జీవనాధారం. ఆ పంట ఎలాగూ తొందరగానే వస్తుందని తినడానికి ఉంచుకున్న జొన్నలూ, పప్పులూ అమ్మేసి, ఎరువులు, పురుగుమందులూ కొని వాడినారట! ఇప్పుడది సొంతం తుడిచిపెట్టుకుపోవడమే గాకుండా మళ్ళీ పంటవేసుకోవడానికి అవకాశం లేకుండా, పొలమంతా మూడడుగుల మందాన ఇసుకమేట వేసిందట! పంటకు పంటా పోయింది ఉంచుకున్న తిండిగింజలూ పోయాయి. ఆ పొలము అంతా ఎందుకూ పనికిరాకుండా పోయింది.

"ఎందుకు ఫికర్ జేస్తవు సోనేరావు! మీకు తప్పకుండా సహాయం ఇప్పించే బాధ్యత నాది. ఏడవకండి మీకోసం ఏదో ఒక రకమైన సహాయం ఇప్పిస్తాను!" అంటూ ఓదార్చాను.

వాళ్ళనలా ఓదార్చేనేగాని వీళ్ళకేరకం సహాయం అందించగలుగుతానోనాకే అనుమానమేసింది గతానుభవాల దృష్ట్యా!

ఏ.సి.రూముల్లో ఉత్పత్తయ్యే చట్టాలూ, నిబంధనలూ తేల్చాల్సిన సంగతి అది! సాటి మనిషికి తక్షణ సహాయం అందించడానికి సాటి 'మనిషే' తయారుచేసిన రూల్సుమీద ఆధారపడవలసిన ఖర్మం పట్టిందీ ఆధునిక ప్రపంచానికి. అందునా మనదేశపు చట్టాలకి చెవులేగాని కళ్ళసలేలేవు. ఉన్న చెవుల వినికిడి సామర్థ్యమూ అంతంత మాత్రమే! నా తక్షణ కర్తవ్యం గురించి ఆలోచిస్తుండగా తెల్లారి పోయింది.

వర్షం మాత్రం ఆగలేదు. బయటకెళ్ళి చూస్తే పెద్దవాగు గట్లుకన్పించకుండా ఉరకలు పరుగులు వేస్తోంది. చుట్టుపక్కల పొలాలన్నీ జలమయమైపోయి సగం మునిగిన చెట్లు కన్పిస్తున్నాయి. నేను మళ్ళీ ఈ రోజంతా ఇక్కడే గడపాల్సి వస్తుందేమోనన్న బెంగతో బాటు, వీళ్ళనష్టాల్ని, కష్టాల్ని చూస్తూ భరించలేక చాలా నిరుత్సాహంగా ఉండిపోయాను.

వాతావరణం చలిగా ఉంది. చూరుక్రింద నెగడు ముందు కూర్చున్నాను. మళ్ళీ ఒక్కొక్కరు మంట చుట్టూ చేరుతున్నారు. జంగూ, సాంబన్న కూడా వచ్చి కూర్చున్నారు.

"ఇగ గీ వాన ఆగేదాకా పెద్దాగుల నీళ్ళు దిగయిసార్! మీరు మా ఊళ్ళనే ఇరుక్కపోతిరి. మీ ఆఫీసోళ్లు ఎదురుజూస్తున్నరో ఏమో!" జంగూ బాధగా అంటున్నాడు.

"ఇంట్ల గూడ సారుకోసం పరేషానయిపోతరు గద!" సాంబన్న అన్నాడు.

"గొంచెం నీళ్ళు గుంజితే జీతాలకు పడిపెటోళ్ళు వోత్తరు, అళ్ళతోటి సారును అగుదాటిద్దాం!" ధర్మన్న అన్నాడు.

"ఎవరు జీతాలకు పడుస్తరు? ఏ ఊరికి?" నేనడిగాను.

"గీళ్ళంతా జీతాలకు పడిపెటోళ్ళే!గా మేడిగూడెంల కాపోళ్ళకు జీతాలున్నరు సార్!"

"గింత ముసురులో ఏంపని సాగుతుందని పోతరు?" అడిగాను.

"ఏం పని పడిసినా పడకపోయినా మాలిక్ ఇంటికి పోవద్దది." "పోకపోతే?" మళ్ళీ అడిగాను.

"ఇగే మున్నది సారూ! గీ మూడొద్దుల జీతం గోస్తరు!"

"ఆ తప్పుమీది కాదే! జీతమెందుకు గోస్తరు?"

"గదంతే సారూ! 'వానవస్తే ఏంది? పనైతే జెయ్యలేదుగదా? ఇంటికాడ సాపుకొని పన్నవు గదా!' అంటరు."

"అరే! ఇదెక్కడి న్యాయమయ్యా! కావాలని పని బంద్‌జేస్తే జీతం గొయ్యొచ్చు!" ఆశ్చర్యపోతూ అడిగాను.

"ఇగ ముందడిసంది గిట్లనే నడుస్తున్నది!"

ఆ గుంపులోనుండి ఉన్నట్టుండి ఓ యువకుడు అడిగాడు—

"మీకు నెలకెంత జీతమిస్తరు సార్!"

ఆ ప్రశ్న అడగ్గానే నేను చెప్పే జవాబుకోసం అందరూ నిశ్శబ్దంగా కుతూహలంగా నన్నేచూస్తున్నారు. నేను కొంచెం ఆలోచనలో పడ్డాను.ఎందుకంటే నా నెల జీతపు అంకెలు, దాదాపు వారి సాలుసరి జీతంతో సమానం. జవాబు వింటే వాళ్ళెంత ఆశ్చర్యపోతారో చూడాలనిపించింది.

"నా నెలజీతం రెండువేలా అయిదు వంద

ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు 'రాగనాథం' మరణించిన కారణంగా ఆకాశవాణిలో విషాద సంగీతం వినిపిస్తున్నారు. "ఈ సంగీతం వాయించింది రాగనాథంగారే"! చెప్పాడు వాసు.

'అదెలా?' ఆశ్చర్యంగా అడిగాడు సూరి.

"ప్రముఖులెవరో పోయినప్పుడు ఈయన వాయించారు, అదే రికార్డు ఇప్పుడు వినిపిస్తున్నారు." చెప్పాడు వాసు.



రూపాయలు.''

''ఎంతసారూ! రెండువేల అయిదువూరు రూపాలా?''

''అవును!''

ఒకేసారి అందరూ వాళ్ళ భాషలో ఏదేదో మాట్లాడుకున్నారు. నిజంగానే వాళ్ళ మొహాల్లో చాలా ఆశ్చర్యం కన్పించినా, ఆ ఆశ్చర్యం వెనుక మరేదో నాకు కన్పిస్తోంది.

మళ్ళీ ఆ యువకుడే అడిగాడు.

''మరి సారూ! మీరు గూడా నిన్నటినుంచి ఏం పనిచెయ్యక మాతోటే గుమంటిరి గదా! మీది గూడా గీ రెండొద్దుల జీతం గోస్తరా?''

ఈ ప్రశ్న వినగానే నాక్కొంచెం షాక్ తగిలినట్లనిపించింది. నిజమే! నేనూ రెండ్రోజుల్నుంచి ఏ పనీ చెయ్యకుండా ఊరికే తింటూ వీళ్ళతో బాటు కూర్చున్నాను. వీళ్ళకేమో కామందులు, పని చెయ్యడానికి ప్రకృతి అనుకూలించకపోయినా, 'నో వర్క్, నో పే' సూత్రాన్ని అమలుచేస్తున్నారు. కాని నేను టూర్‌లో ఉన్నాను. ఈ రెండురోజుల జీతమే గాకుండా, టి.ఎ, డి.ఎల రూపంలో గూడా జీతమంతసమానంగా వస్తుంది. అంటే నేను పనిచెయ్యని రోజున నాకు రెట్టింపు జీతమన్నమాట!

ఈసారి జవాబు చెప్పడానికి కాస్త భయపడ్డాను. వాళ్ళు మళ్ళీ నా జవాబుకోసం ఆత్రుతగా, నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్నారు. ఆ లోపున వారు, లోలోపల ఎవరికి వారే 'జీతం గోస్తరా, గొడ్యరా!'' అని తర్జనభర్జన పడుతున్నట్లుగా వాళ్ళ మొహాల్లో భావాలు చెప్తున్నాయి.

వీళ్ళెలా స్పందిస్తారో చూద్దామనుకొని, నిజమే చెప్పేద్దామని నిశ్చయించాను.

''నా జీతం కొయ్యరు. మీవూర్లె రెండొద్దులున్నందుకు, ఆ రెండొద్దులకు డబల్ జీతమిస్తరు.''

''ఏం పని జెయ్యకపోయినా?'' ఇందాకటి యువకుడు రెట్టించి అడిగాడు.

''అవును'' అన్నాను.

అందరూ ఒక్కసారి నా జవాబు విని నిశ్శబ్దంగా ఆలోచనల్లో పడిపోయారు.

వాళ్ళేం ఆలోచిస్తున్నారో వాళ్ళ మొహాల్లో మారే రంగుల్ని బట్టి నేనూహించుకోగలను. ఇందాకటి యువకుడి మొహం దీర్ఘాలోచనతో ఎరుపుగా మారుతున్నట్లు నాకు స్పష్టంగా కన్పిస్తోంది.

ఇప్పుడు వాళ్ళు డార్విన్ సిద్ధాంతంలోని ''మనుగడకోసం పోరాటం'' గురించి ఆలోచించినా, అలాంటి సిద్ధాంతమొకటుందని వారికింకా తెలియదు.

వారి మౌనం మాత్రం నాకు అప్పుడే ఉదయించే సూర్యునిలా అనిపిస్తోంది. వారి దోపిడీ వర్గానికి ప్రథముడిగా నన్ను నేను ఊహించుకొని దోషిలా తలవంచుకున్నాను.

అంతలోకే— ఓ కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు. ''పెద్దాగు దిగిపోతున్నది, ఇగ అవతలి ఒడ్డుకుపోవచ్చు'' అని!

# విజ్ఞాన—చంద్రిక

## ఇండియాకు తప్పిపోయిన మిడతల దండు బెడద

ఇండియాలోనూ, పొరుగు దేశాలలోనూ పంట పొలాలకు హాని కలిగిస్తాయని భావించిన మిడతల దండును ఆఫ్రికాలో ఉండగానే తుదిచి పెట్టడంలో అమెరికా ప్రభుత్వపు 'టాస్క్‌ఫోర్స్' తోడ్పాటును అందజేసింది. మిడతల దండు ఆఫ్రికా నుంచి దక్షిణ ఆసియా, అరేబియన్ సెనిస్సులాలో ప్రవేశించకుండా నిరోధించడంలో ఈ అమెరికన్ 'టాస్క్‌ఫోర్స్' పూర్తిగా సఫలీకృతమైంది.

మిడతల దండును నిరోధించే అంతర్జాతీయ కృషిని అమెరికన్ ఫారిన్ డిజాస్టర్ అసిస్టెన్స్ కార్యాలయం (ఒఎఫ్‌డిఎ)కి చెందిన ఈ డిజర్ట్ లోకస్ట్ టాస్క్‌ఫోర్స్' సమన్వయీకరించి నిర్వహించింది. ఈ కృషికై అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యుఎస్ఎఐడి) సుమారు 65.65 కోట్ల రూపాయలు సమకూర్చింది. సెనెగల్ నుంచి సూడాన్‌లోని రెడ్‌సీ తీరం వరకు పంటలకు మిడతల బెడద తరచూ ఏర్పడుతున్నది.

గతంలో 1950 దశకంలో పెద్ద ఎత్తున మిడతల బెడద ఏర్పడినప్పుడు పంట పొలాలలో లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలు ధ్వంసమయ్యాయి. కాగా 1988లో ఈ మిడతల బెడద సూడాన్, సహెల్ నుంచి ఉత్తర ఆఫ్రికాకు వ్యాపించి మళ్ళీ అక్కడి నుంచి తూర్పు దిశగా విస్తరించే ప్రమాదం కనిపించింది. అయితే ఐక్యరాజ్య సమితి ఆహార వ్యవసాయ సంస్థ, మిడతల బెడద వ్యాపించిన దేశాల ప్రభుత్వాలు, ఇంకా విరాళాలు సమకూర్చిన సంస్థల సంయుక్త కృషివల్ల ఈ బెడదను విజయవంతంగా నివారించడం జరిగిందని 'టాస్క్‌ఫోర్స్' అధ్యక్షుడు రాబర్ట్ హ్యూస్‌మన్ అన్నారు.

ఈ మిడతల దండు కనుక ఇండియా లాంటి దేశాల వరకు విస్తరించినట్టయితే అక్కడ ఈ ఏడాది కురిసిన వర్షాలు కొద్ది నెలలలోనే ఆ మిడతల సంఖ్య ఎంతగానో పెరిగి పోవడానికి తోడ్పడివుండేవని, దీనివల్ల పంటలకు తీవ్ర నష్టాలు జరిగేవని పరిశీలకులు భావించారు.



'మీ టైలర్ అడ్రస్ ఇస్తారా'
'ఓ తప్పకుండా. దయచేసి నా అడ్రస్ వాడికివ్వకండి'

మిడతల వ్యాప్తికి దేశాల సరిహద్దులు అడ్డురావని అవి వారానికి వెయ్యి మైళ్ళ వంతున ప్రయాణం చేస్తాయని అమెరికన్ 'టాస్క్‌ఫోర్స్' అధ్యక్షుడు అన్నారు. మిడతల దండు వివరాలను ఆఫ్రికా మధ్యప్రాచ్యం, దక్షిణ ఆసియా, యూరప్‌లకు తెలియజేయడంలో ఈ 'టాస్క్‌ఫోర్స్' కీలకపాత్ర వహించింది. ఒక నిర్ణీత కాలంలో మిడతలు ఒక ప్రాంతానికి చేరుకోవడంపై సర్వే జరపడం, వాటి వలసను వాటి సంఖ్య పెరుగుదలను అడ్డుకొని తద్వారా అవి పంటలు గల ప్రాంతాలకు విస్తరించకుండా నివారించడం అనే అంశాలపై 'టాస్క్‌ఫోర్స్' ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టు ఆయన చెప్పారు. దీనివల్ల దక్షిణ మొరాకో, దక్షిణ మారిటేనియా, ఉత్తర సెనెగల్, దక్షిణ అల్జీరియా, ఉత్తర మాలీ, ఉత్తర నైజర్, పశ్చిమ సూడాన్, సూడాన్‌లోని రెడ్‌సీ తీర ప్రాంతాలలో మిడతలను నిరోధించే కృషిపై బాగా శ్రద్ధ వహించారు. అమెరికా ఫారిన్ డిజాస్టర్ అసిస్టెన్స్ కార్యాలయం తన 'టాస్క్‌ఫోర్స్' ద్వారా మిడతల బెడద తొలగింపునకై క్రిమి సంహారకాలు, కమ్యూనికేషన్ పరికరాలు మొదలైన వాటిని ఆయా దేశాలకు సరఫరా చేసింది. వర్షాకాలమంతటా కూడా అమెరికా భూభౌతిక సర్వేవిభాగం వారు మిడతల పునరుత్పాదన, పెరుగుదలకు అనువుగానున్న 'పచ్చని' ప్రాంతాల ఉపగ్రహ చిత్రాలను సమకూర్చారు. ఈ చిత్రాల ఆధారంగా ఆయా ప్రాంతాలలో మిడతల నిరోధంపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించడానికి వీలు కలిగింది. దీనితోపాటు వివిధ దేశాలు సమకూర్చిన 60 విమానాల నుంచి సెంట్రల్ సూడాన్, సహెల్, నైజర్, అల్జీరియా, మాలీ సరిహద్దు ప్రాంతాలు, మారిటేనియా, అట్లాస్ పర్వతాలు మొరాకో వరకు 'స్ప్రే' కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రకృతి కూడా ఈ మిడతల నిరోధం కృషికి ఎంతగానో తోడ్పడింది. భారీ వర్షాలు కురవడం వల్ల పచ్చిక బాగా పెరిగి మిడతలకు మంచి ఆహారం నవరు లభించింది. ఈ పచ్చిక అందుబాటులో ఉండడం వల్ల మిడతలు పంటలకు దూరంగా ఉండిపోయాయి. దీనికి తోడుగా...సెనగాలి వీచడంతో మిడతలు సెనెగల్, మారిటేనియా, పశ్చిమ సహారా భాగం నుంచి రెండు వేల మైళ్ళ దూరంగా... అట్లాంటిక్ మహాసముద్రం వెంబడి కొట్టుకు పోవడం, లక్షలాది మిడతలు చనిపోవడం కూడా జరిగింది.

యుఎస్ఐఎస్